


# ఆత్మసమర్పణం

(వంగదేశకథల ననుసరించి)

భాస్కర్ల గోపాలకృష్ణమూర్తి గారు

నేను ప్రవేశపరీక్ష ప్యాసై కళాశాలలో ప్రవేశించినప్పుడు, ఎవ్వరూకూడా నాజీవితమంతా ఒక పాఠశాలలో బీద ఉపాధ్యాయుడుగా గడపవలసి ఉంటుందని అనుకోలేదు. కుటుంబానికంతా నేను రక్షకుణ్ణి ఔతానని మావాళ్లు అంటూఉండేవారు. మా అమ్మ ఎప్పుడూ ఒక బంగారు నగైనా పెట్టుకోలేదు. ఆమెకు లేవు కూడాను. కాని తనకు వచ్చే కోడలు మాత్రం రత్నాభరణాలు పెట్టుకుంటుందని ఆమె ఆశపడేది. నేను మొట్టమొదటనే, చదువులో ప్రవేశించినప్పుడు ఉచితవేతనంకూడా పొందగలిగాను. అందుచేత అధమం జడ్జీపనైనా అవుతుందని అనుకునేవారుమావారు. నేనుచేయవలసిన ఆజడ్జీపని యిప్పుడు ఎవరుచేస్తూఉన్నారో అని నాకు ఆశ్చర్యంవేస్తుంది! మా అమ్మకు మాత్రం చివరవరకు తన కుమారుని అదృష్టం యీలా మారుతుందని సంశయం లేకపోయేది.

మాయిల్లు చాలా పురాతనమైనది. ఇంటి నానుకొని ఒకదొరువుకూడా ఉండేది. ఇవే మాకున్న ఆస్తి అంతాను. పైగా కొంతమంది బంధువులు, బీదవారు, ఎప్పుడూ విడువకుండా మా యింట్లో ఉండేవారు. మా యింట్లో ఉండి మా తిండితింటూ ఉండడము, వారు వారసత్వపుహక్కుగానే పరిగణించేవారు. మా తండ్రిగారు కష్టపడి ఏలాగో కొంతసొమ్ము సంపాదించేవారు. మాతల్లిగారంతకంటె కష్టపడి కుటుంబానికేమీ లోటు జరక్కుండా చేసేవారు. మిగిలిన వారంతా తింటూ చూస్తూ కూర్చోవడంతో సంతుష్టి చెందేవారు.

నేను పట్నంలో చదువుకోడానికి తగినంత డబ్బులేదు. మా అమ్మమాత్రం నన్ను చదివించి తీరవలెనని పట్టుపట్టింది. పాపం నేను జడ్జీపని చేస్తానని ఆమె ఆశ. అందుచేత ఆమెవంటి నున్నా నగలు నాలుగు తీసి నాకిచ్చేసింది. వీటితో చదువుకోసం బయలుదేరాను. ఈనగల సొమ్మంతా వడ్డీతో సహా ఆమెకు యిచ్చివేయగలుగుదునని అప్పుడు ఆశపడ్డాను. కాని యిప్పుడామెకు వస్తువులే అక్కరలేక పోయినాయి.

నేను పట్నంలో ఒకసందులో ఉన్న రెండంతస్థుల మేడలో ఉండేవాణ్ణి. నా సహపాఠకులు కొంతమంది చాలా డబ్బుగలవాళ్లు. వారు పట్నవాససుఖాలన్నీ అనుభవించేవారు. కాని నావంటి బీదవిద్యార్థులకు ఏం సంతోషం ఉంటుంది! మాతోడి కులాసాపురుషుల చేష్ట లసహ్యించుకుంటూ వైరాగ్యసంబంధమైన కబుర్లు చెప్పేవాళ్లం. పట్నవాససుఖాలు మరగిన విద్యార్థులు వారి గ్రామాలు, యిళ్లు మరచిపోవడానికి ఆట్టే కాలం పట్టదు. కాని ఎప్పుడూ ఆచిన్నగదిలో పుస్తకం చేతపట్టుకొని పడివుండే నాకు గ్రామజీవితం మరచిపోవడం సులభసాధ్యమైన విషయం కాదు. మాయింటి సంగతి, అక్కడి స్వేచ్ఛావాతావరణం, మనస్సుకు కట్టినట్టుండేది. నేను చాలాకాలం పట్నంలో గడిపినా గ్రామజీవితమందు అభిమానం మాత్రం నశించలేదు.

ఇట్లా కొన్ని సంవత్సరాలు గడచినాయి. చదువు పూర్తైంది. పరీక్షలైపోయినవి. నా చిన్నసంచీ చేతబట్టుకొని స్టేషనుకు బయలుదేరాను. రైలుబండీలో ఎక్కాను. మా అమ్మవస్తువులు నన్నింతవరకు తీసుకువచ్చాయి. నావద్ద ఒక్క పైసాఅయినా మిగల్లేదు. నేను ప్యాసైతే తత్క్షణం ఉద్యోగంలో ప్రవేశించి యమ్.ఏకు ప్రైవేటుగా చదవా లనుకొన్నాను. నేను బండీలో ఉన్నంతసేపూ పరీక్షలో ఎన్నిమార్కు లొస్తాయోనని లెఖ్ఖపెట్టుకుంటూ కూర్చున్నాను. బాగా ప్యాసైతే తిరిగి ఉచితవేతనం సంపాదింప వచ్చునని అనుకున్నా.

సాయంకాలానికి మా గ్రామం చేరుకున్నాను. మా యింటికి స్టేషనుకు ఒకమైలమే అడ్డం. రైలుదిగి యింటిదగ్గరకు చేరుతూన్నకొద్దీ యింట్లో మా వాళ్లేమి చేస్తూ ఉంటారోనని ఊహలపై ఊహలు మనసులో పుట్టినవి. ఈసరికి మా అమ్మ, తులశమ్మదగ్గర దీపంవెలిగించి పాటలు పాడుకుంటూ ప్రదక్షిణాలుచేస్తూ దణ్ణం పెడుతూ ఉంటుందని; మా చిన్నతమ్ముడూ, చెల్లెలూ అమ్మమ్మ దగ్గరచేరి కథలు చెప్పమని వేధిస్తూ ఉంటారని; నా రెండోతమ్ముడు మాధవుడు దీపందగ్గర చదువుకుంటూ ఉంటాడని; యీలాటివే ఎన్నో ఊహలు దొర్లిపోయినాయి.

నేను గుమ్మందగ్గరకు వెళ్లగానే కిలకిల్లాడుతూ అంతా బయటికి వచ్చారు. మా అమ్మ నన్ను చూచి నప్పుడు ప్రేమాస్పదమైన నవ్వు నవ్వేది. ఈసారి ఆమె సంతోషమునకు మేరయేలేదు. మా కుటుంబం అంతా దేన్నిగురించో చాలా హడావుడిగా ఉన్నట్టు కనుపించింది. నా కారహస్యం త్వరగానే తెలిసిపోయింది. సాధారణంగా గ్రామస్థుల జీవితంలో, ఒకటిరెండు విషయాలకంటే సంతోషావహమైనవి ఉండవు. ఇప్పుడు మా యింట్లో సంతోషం కలిగించిన సంగతి తెలిసికోడానికి ఆట్టేసేపు పట్టలేదు. నా చిన్నతమ్ముడు, చెల్లెలు నాదగ్గరచేరి ఆవార్తకాస్తా ఊదేశారు. నా పెండ్లికి వధువునుగురించి మాటలు జరిగినవి. ఆమె తండ్రి చాలా బీదవాడు. కాని ఆ చుట్టుప్రక్కల ఆ అమ్మాయంత చక్కంది లేదని వాడుక. ఆ అందముచూచి ఏమీ కట్నం అక్కర లేకుండానే చేసికోవాలని మా అమ్మ యిష్టపడింది. నేను తప్పకుండా జడ్జీపని చేస్తానని ఆమె నమ్మకం కాబట్టి, ఎక్కువ కట్నం పుచ్చుకొని అందం లేనిపిల్లను కట్టబెట్టడం ఆమె కెంతమాత్రం యిష్టంలేక పోయింది. మాటలన్నీ స్థిరపడి పోయినాయి. ఇక వధువును చూచుకోవడమున్నూ మా తండ్రిగారి కీసంగతి తెలియజేయడమున్నూ మాత్రం మిగిలింది.

ఈసంగతి యింతవరకు మా తండ్రిగారికి తెలియక పోవడమనేది చాలామందికి ఆశ్చర్యం కొల్పకమానదు. దానికో కారణం ఉంది. ఆయన సంవత్సరంలో చాలాభాగం వ్యవహారంమీద యితర గ్రామాల్లో ఉండేవారు. మా అమ్మకు చదువురాదు. కాబట్టి నాతమ్ముడు మాధవుడు మా తండ్రిగారికి ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడు. ఈ ముఖ్యమైన విషయంగురించి వానిచేత వ్రాయించడానికి ఆమెకు యిష్టంలేదు. చిన్నతనంచేత సరిగ్గా వ్రాయక ఏ అవకతవకలో వ్రాశాడంటే ఆయనకు కోపంవచ్చి యీచేసిన ఏర్పాటంతా భంగంచేస్తారని అనుకొంది. ఆయన యింటికి వచ్చినతరువాత నెమ్మదిగా యీసంగతి ఆయన చెవినివేసి ఒప్పించాలని కనిపెట్టుకుఉంది. కట్నం లేకుండా సంబంధనిశ్చయం చేసికోవడం మా తండ్రిగారికి యిష్టముండదు. ఆయన ప్రపంచంతో సంబంధించిన మనిషిన్ని, పైసలు లెఖపెట్టేవారు కాబట్టి నేను ముందెప్పుడో జడ్జీపనిచేసినా చేయకపోయినా కొన్నివేలు అక్కడ పెట్టించందీ నాకు పెండ్లిచేయడం ఆయనకు సరిపడదు. అందుచేత యీవిషయంలో మా అమ్మచేసిన తెలివితక్కువ పనికి తప్పకుండా ఆయనకు కోపం వస్తుందని అంతా అనుకున్నారు.

తండ్రిగారు యింటికి రావడాని కింకా కొద్ది దినాలు ఆలస్యంఉంది. ఈలోగా పెండ్లికుమార్తెను చూచుకు రావాలని అనుకున్నాం. మా అమ్మ పూర్వకాలపు మనిషైనా, మా నూతన వివాహపద్ధతులయందు కొంచెం గౌరవం లేకపోలేదు. ఒక మంచిరోజు చూచి నేనూ, మా మాధవుడు, యిద్దరు ముగ్గరు స్నేహితులతో కలసి ఆగ్రామానికి వెళ్లాము.

కన్యతండ్రి చాలా బీదవాడని ముందుగానే మాకు తెలుసును. వారి యింట్లో ప్రవేశించగానే యీసంగతి ధ్రువపడింది. మేము కూర్చున్నగదిలో ఒక పట్టెమంచమున్నూ, ఒక నులకమంచమున్నూ మాత్రం ఉన్నవి. వాటిమీద దుప్పట్లు పరిచారు. ఇంటియజమాని చాలా మర్యాదగానూ, వినయంతోనూ ప్రవర్తించి తన బీదతనం కనుపించకుండా చేయడానికి ప్రయత్నించారు. ఆమెను మాత్రం యింకా తీసుకరాలేదు. తండ్రి తరుచు లోపలికి వెళ్లడం బయటకువస్తూఉండడంబట్టి యింకా ముస్తాబు చేస్తున్నారని ఊహించాము. ఇంతలో కొన్ని ఫలాహారములు తీసికొనివచ్చి మాముందు పెట్టారు. నాస్నేహితులు తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. నాకు మాత్రం ఆమెను ఎప్పుడు చూస్తామా అని తొందరగా

ఉంది. ఏదో జీవనాధారం ఏర్పాటుకాంది వివాహం చేసుకోకూడదనుకునే వాళ్లల్లోచేరినవాణ్ణిఅయినా, కన్య చాలా అందంగా ఉంటుందని వినగానే యీ అభిప్రాయాలన్నీ భూలి కెగిరిపోయినాయి. ఇంతలో ప్రక్కగదిలోనుండి గాజుల గలగలధ్వని, చీరనుడత విప్పుతున్న



చప్పుడు వినపడింది. ఉషఃకాలమునందలి చీకటులను పారదోలు వెలుతురు ప్రకాశించినట్టు, మా కండ్లఎదుట ఆకన్య ప్రకాశించింది. ఇదివరలో ఆమె సౌందర్యాన్ని గురించి విన్నమాటలన్నీ ప్రత్యక్షంగా ఋజువైనాయి. ఈసమయానికి కొన్ని నగలు ఎరువుతెచ్చి పెట్టుకున్నా ఆమె సహజలావణ్యం వాటికన్నాకూడా వన్నె తెచ్చింది. ఈ బీదకుటుంబంలో ఆమె పుట్టిందని నమ్మడానికి వశమైందికాదు. ఐతే ఏ భాగ్యవంతుల యిండ్లలోనో యీమె పుట్టిఉంటే యింత అద్భుతలావణ్యంతో ప్రకాశించి ఉండేదికాదు. ఆమె కన్నులలో దివ్యతేజస్సు వెలుగుతూ ఉన్నట్టు కనిపించింది. సంధ్యారాగమే సాక్షాత్తు యీ రూపంగా అవతరించినట్టు భ్రమించాను.

ఆమె వయస్సు పదిపదకొండేళ్లని తండ్రి చెప్పినా చూచినవారికి ఆమాట అబద్ధమని తోచకమానదు. ఐనా మనలో పిల్లలవయస్సు దాచటం అలవాటేకాక, కన్య వయస్సుమీరినకొద్దీ లోపల సంఘబహిష్కార భయం పీడిస్తూ ఉంటుంది కాబట్టి యీ అబద్ధం, ఆక్షేపాటింపదగ్గదికాదు.

నా స్నేహితులొకరు "నీపేరేమమ్మా" యని ఆ కన్య నడిగారు. "సుశీల" ఎంత మధురమైనధ్వని! ఆ పేరు వినగానే దానికి తగినట్టు ఆమె సౌశీల్యతకూడా నాకు స్పష్టమైంది.

కన్యను లోపలికి తీసికొని వెళ్లిపోయారు. తన కుమార్తె పరీక్షలో నెగ్గిందని విని తండ్రి చాలా సంతోషించాడు. మేము తిరిగి యింటికి చేరినంతకాలము నా హృదయము వెనుకకే లాగుతూ ఉంది.

కన్య నాకు నచ్చిందని విని మా అమ్మ చాలా సంతోషించింది. ఇంట్లో పిల్లలంతా మాధవుని చుట్టూ

చేరి వధువు రూపరేఖావిలాసాదులవర్ణన వింటున్నారు. ఆమె నేత్రముల విశాలత, చక్కనిరూపము, పొడుగైన నల్లని కేశములు, వీనినిగూర్చి నాసోదరుడు వర్ణించినట్లు నా జన్మలో నేను చెప్పలేకపోయే వాణ్ణే. స్వచ్ఛమైన ఆమెమూర్తియొక్క కాంతిమాత్రం నాకండ్లకు కట్టినట్లే ఉంది.

సంబంధం స్థిరపడినట్లే. ఇంట్లో పెండ్లిపనులు తొందరగా జరుగుతున్నాయి. నేనెంత ప్రయత్నంచేసినా మేము వధువును చూచుటకు వెళ్లిననాటి సంధ్యారాగము, ఆసందర్శనము మరపుకు రాలేదు. తిరిగి ఎప్పుడు సందర్శనభాగ్యం కలుగుతుందా అని మనస్సు ఉవ్విళ్లూరుతూ ఉండేది. దీనివల్ల నాపరీక్ష ఏమాతుందో అనే చింతకూడా నాకు లేకపోయింది.

అకస్మాత్తుగా మా తండ్రిగారు యింటికి వచ్చారు. పెండ్లిసంగతి నెమ్మదిగా మా అమ్మ ఆయనచెవిని వేసింది. కన్య సుగుణసంపత్తి, సౌందర్యము, తన యావచ్ఛక్తి వినియోగించి వర్ణించింది. కాని యిదేది ఆయన మనస్సుకు పట్టలేదు. ఆయనకు ముందు డబ్బుసంగతి కావాలి. పిల్ల ఎట్లుఉన్నా సరే అవసరంలేదు. ఈ సంబంధం నాకు నచ్చలేదని ఆయన చెప్పేశారు. ఇంట్లో గందరగోళం బయలుదేరింది. మా అమ్మ చివరకు ఆడవాళ్లకు సహజమైన ప్రతిక్రియ అవలంబించింది. ఆమె ఏడ్పు చూచి మాతండ్రిగారి మనస్సు కొంచెం కరిగినా సంబంధానికి మాత్రం యింకా యిష్టపడలేదు.

ఆ సమయానికి మా తండ్రిగారి తోడల్లుడు రామచంద్రయ్యగారు వకాయి వచ్చారు. ఈసంగతంతా ఆయన విని ఏమీ చిక్కులేకుండా తాను అందరిని దరిచేరుస్తానని అభయం యిచ్చారు. మా తండ్రిగారితో ఏమి చెప్పారోకాని మా అమ్మదగ్గరకు వచ్చి "అమ్మాయీ, అన్నయ్య వట్టి కోపదారిమనిషి. సంగతి సందర్భాలు ఆలోచించడు. అన్నిటికీ నేనున్నాను. ప్రయత్నాలు సాగించండి" అన్నారు.

చివరకు ముహూర్తంరోజు వచ్చింది. బంధువులు స్నేహితులు అంతా వివాహానికి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంత అందకత్తె అని చెప్పుకుంటూ ఉన్న వధువును ఎప్పుడు చూస్తామా అని అందరికి ఆతురతగానే ఉంది. ఈ ఉత్సాహానికంతా నేనేకదా కారణం అని మనస్సులో నాకు కొంచెం అతిశయభావం కలిగింది.

పెండ్లివారి ఊరికి మా ఊరికి ఎంతో దూరం లేదు. మేమంతా బయలుదేరి ఆగ్రామం చేరేసరికి సాయంకాలం యింకా కొంచెం వెలుతురుంది. దారిపొడుగునా మాతండ్రిగారు, తోడల్లుడు, ఏవో గుసగుసలాడుతూనే ఉన్నారు. నేను శ్రద్ధగా వింటే సంగతులన్నీ తెలుసునుగాని, ఎందుచేతనో వాటిమీదకు నా మనస్సు పోలేదు.

పెండ్లికుమార్తె యింటివద్ద ఆట్టే ఏమీ హడావిడి లేదు. వారితరపు బంధువులుకూడా కొద్దిమంది వచ్చారు. గృహానికి అలంకారాలుకూడా తక్కువే. చిన్న పందిరి వేసి చాందినీకట్టారు. చాకళ్లు రెండుకాగడాలు పట్టుకనిలుచున్నారు. కాని పెండ్లివారి ఆదరణమాత్రం చాలా ఎక్కువగా ఉంది. మా తండ్రిగారు, పినతండ్రి ఎంతో తీవ్రంగా చూస్తూ కూర్చున్నారు. పెండ్లికుమార్తె తండ్రి చేతులుకట్టుకొని వినయవిధేయతలతో తిరుగుతున్నారు.

నన్ను లోపలికి ఆడవాళ్లదగ్గరకు తీసుకు వెళ్లారు. అక్కడ చాలా ఉత్సాహంగా ఉంది. ఆదృశ్యం చూడ్డానికి నాకెంతో వేడుకైంది.


లోపలినుంచి పెండ్లికూతుర్ని పందిట్లోకి తీసుకుని వచ్చారు. ఇక యథావిధిగా యిప్పుడామె నా భార్య కాబోతూఉన్నా, నే నెప్పుడు మొదట ఆ కన్యనుచూచానో అప్పుడే ఆమె నాసొమ్మయి పోయిందని మనస్సులో అనుకున్నా. మాతండ్రి పినతండ్రిచాలాసేపు ఆమెను ఎగాదిగా చూచారు. రామచంద్రయ్యగారు "పిల్లవస్తువులు ఎక్కడున్నాయి. అవి తీసికొచ్చి మాముందు పెట్టండి." అని ఒక్కకేక వేశారు. సుశీల తండ్రి దిగాలబడిపోయారు.

"నేను పెట్టగలిగినవేవో మాఅమ్మాయివంటిమీదనే ఉన్నాయండి" అని తడబడుతూ అన్నారు.

మాపినతండ్రి లేనినవ్వు తెచ్చుకొని

“సరేలెండి, పరిహాసాలుంటే ఆనక మాదుకుందాము. మనం వియ్యంకులం అవుతున్నాము కాబట్టి ఎన్నిఅయినా వేళాకోళాలు చేసికోవచ్చును. ముందుపని కానివ్వండి. వస్తువులిట్లా తీసుకరండి” అన్నారు.

పెండ్లికుమార్తె తండ్రి చేతులు జోడించుకొని దీనంగా



“అయ్యా బీదవాణ్ణి రక్షించండి. ఇంతకన్నా ఎక్కువపెట్టలేన” అని ప్రార్థించారు. మా పినతండ్రి ముఖంలో ఆకాస్తనవ్వు మాయమైపోయింది.

“మామంచివేషాలు వేస్తున్నావయ్యా ఒకదమ్మిడీ యివ్వనక్కరలేకుండా యిటువంటివరుణ్ణి సంపాదించి, పదితులాలు బంగారమైనా పిల్లవంటిమీద పెట్టకుండా తీసుకొచ్చి నుంచోబెట్టారూ? పెండ్లికొడుక్కు గడియారం, గొలుసూ తెప్పించండి. ఇదంతా సలక్షణంగా జరగాలంటేవస్తువులూ తదితరలాంఛనాలూ లేందవీల్లేదు. లేకపోతే వివాహం ఆగిపోవలసిందే” అని కేకలు వేయటం మొదలుపెట్టారు.

ఆకన్య తండ్రి మా తండ్రిగారిచేతులు రెండూ పట్టుకొని“అయ్యా, నన్ను రక్షించాలి బీదబ్రాహ్మణ్ణి. నాశనమైపోతాను. ఈ మాత్రం చాలని మొదటిలో ఒప్పుకున్నారు. కరుణించాలి” అని కంటనీరు పెట్టుకున్నారు.

మాతండ్రిగారేమీ మాట్లాడలేదు. మా పినతండ్రి మాత్రం;

“ఎవరు చెప్పారయ్యా, మా కాసంగతేమీ తెలియదు. కట్నం లేదుగదా పిల్లకు నగలు, యింకా లాంఛనాలు జరుపకుండా ఉంటారా అని అనుకొన్నాంగాని మాఅబ్బాయికీమాత్రం సంబంధం దొరక్కపోతుందనా” అంటూ లేచారు.

ఇంతలో పెండ్లికుమార్తె తరఫువారెవరో;

“వీళ్లంతా శుద్ధ మూర్ఖుల్లాఉన్నారే; అంతా సిద్ధమై చివరకువచ్చేసరికి వళ్లీ మొదటికిదెచ్చి ఆబ్రాహ్మణ్ణి నాశనం చెయ్యడానికి ఆలోచిస్తున్నారు” అని కేకవేశారు.

దాంతో పెద్దఅల్లరి బయలుదేరింది. “ఏమిటే, ముందు మమ్మల్ని మోసంజేసి తరువాత తిట్టుకూడా ప్రారంభించారు. పెద్దమనిషైన వాడెవడూ ఒక్కనిమి

షం యిక్కడుండదు. లేవండిపోదాం", అంటూమావాళ్లంతా లేచి ఒక్కసారిగా బయటకు వెళ్లారు. ఇద్దరు మనుష్యులు నా రెండురెక్కలూపట్టుకొని పీటమీదనుంచి లాక్కుపోయారు. ఈ గందరగోళంలో రెండు మూడు దీపాలుకూడా తన్నేశారు. ఇంట్లోనుంచి ఆడవాళ్ల ఏడ్పులు వినపడుతున్నాయి. మగాళ్లు కేకలేస్తున్నారు.

నాకు ప్రొద్దున్నుంచి ఉపవాసం. ఈలాగులాటతో ఉన్నమతికాస్తా పోయింది. పెండ్లికుమార్తె తెల్లబోయి చూస్తూ కూర్చుంది. ఒక్కసారి నాచూపు ఆవైపుకు త్రిప్పాను. మా యిద్దరిచూపులు ఒకటిలో ఒకటి లీనమైపోయాయి. ఇంతలో నన్నవతలికి తీసుకపోయారు.

మా బళ్లు ఊరిబయట దింపారు. తిరిగి యింటలోకే అవసరంఉంటుందని తెలియక బళ్లవాళ్లు తలోదారి వెళ్లారు. మాతండ్రిగారు, రామచంద్రయ్యగారు అందరికంటె ఎక్కువకేకలు మొదలుపెట్టారు. మామాధవుడుమాత్రం విచారంగా నుంచున్నాడు. వాడుకూడా సుశీలను చూచాడు మరి.

కొంతసేపటికి నేను స్థిమితపడ్డాను. నాలో నేను వితర్కించుకోవడం మొదలుపెట్టాను. "నే నెంత పని చేశాను! వీళ్ల చేతుల్లో ఒకకీలుబొమ్మగా ఉపయోగింపబడ్డానే" అని నన్ను నేను నిందించుకున్నాను. ఇంతలో సుశీల దృష్టినాకు జ్ఞాపకం వచ్చింది. ఇట్లా జరిగినందుకు ఆచూపులు నన్ను తిరస్కరిస్తున్నట్టు తోచగట్టింది. దానితో నామనస్సు పూర్తిగా మారిపోయింది. మా తండ్రిగారిని, ఆయనకోపాన్ని అంతా మరచిపోయాను. వాళ్లంతా బళ్లుకట్టించుకొనే హడావిడిలో ఉండగా నేను నెమ్మదిగా పెండ్లివారియింటివైపు దారిబట్టాను. అచ్చట హడావిడిఅంతా సద్దణిగినట్టుంది. ఏడ్పులూ, ఆర్భాటాలు ఏమి వినపడ్డంలేదు. ఇద్దరుముగ్గురు మనుష్యులుయింట్లోనుండి పట్టుతాబితాలు చంకను బెట్టుకొని చేతిలో తాంబూలంతో, త్రేన్చుకుంటూ బయటికి రావడం చూచాను. వారిలో వారిట్లు మాట్లాడుకొన్నారు.

"మా బాగా జరిగిందోయి."

"అదృష్టం అంటే ఆ పిల్లదేనండి. ఎవరో చిన్న గుమాస్తా కోడలవడం బదులు యిప్పుడు పెద్ద జమీందారుభార్య అయ్యింది."

"రెండు నగలకోసం ఎంత హడావిడి చేశారు. ఇప్పు డాకన్యకు కావలసినన్ని నగలు. వజ్రవైడూర్యాలతో పొదిగినవి పెట్టుకుంటుంది."

ఒకాయన అంగవస్త్రంతో విసరుకుంటూ,

"అయితే మాత్రం, యీ నూత్నవరుడు కొంచెం వయస్సు మీరినవాడు. మగాడికి ముసలితనం అంటూ ఏమిటిలెండి. ఎన్ని పెళ్లిళ్లయినా చేసుకుంటాడు. ఆకుఱ్ఱదాన్ని చూచే సరికి ముసలాడికి, మనస్సు ఉబలాటపడి ఉంటుంది. చూశారుకామా, ఆఖర్ని పెండ్లికొడుకు తండ్రిని దూషించిం దాయనే. తన లాభంకోసమే యిదంతా చేసుంటాడు." అంటూ వెళ్లిపోయారు.

నేను హతాశుణ్ణయిపోయి వెనక్కి తిరిగి మావాళ్లల్లో కలుసుకున్నా. నేను వెళ్లేసరికి యింకా బళ్లు కట్టలేదు. అందుచేత నేను అక్కడ లేనిసంగతి ఎవరూ గ్రహించలేదు.

మేమంతా యింటికి చేరిన మరునాడే పట్నం బయలుదేరాను. మా అమ్మ చాలా విచారించింది. కాని నేను ఆగలేదు. ఎట్లాగో పరీక్షలో నెగ్గాను. ఇకముందు చదువు సంగతి పూర్తిగా కట్టిపెట్టి తక్షణం ఉద్యోగంలో ప్రవేశించాను.

## ౨

కొద్దికాలంలోనే మా తండ్రిగారు చనిపోయారు. కొంతకాలం వరకూ మాకుటుంబం మా గ్రామంలోనే ఉంది. రాత్రింబగళ్లు కష్టపడి ఎట్లాగో వారిని సంరక్షించే వాణ్ణి. కాని నా సంపాదన రెండుపొట్లకూ సరిపోవడం కష్టమైంది. పైగా నా తమ్ముల చదువు చూడుకోవలసి ఉంది. ఇవన్నీ ఆలోచించి మాతల్లిగారిని, సోదరులను పట్నం తీసుకవచ్చాను. పాపం, మా యింట్లో బంధువులకు మాతో కూడా రావడానికి సాధ్యపడలేదు కాబట్టి వారిదారి వారు చూచుకున్నారు.

మా ఊళ్లో యిల్లు పాతదైనా చాలా విశాలంగా ఉండేది. ఈ పట్నంలో కాళ్లు అరిగేటట్టు తిరిగితిరిగి

విసికి వేసారి చివరకు ఒక సందులో చిన్నయిల్లు పుచ్చుకున్నాం. మాసందుకు ప్రక్కను రాజవీధి అవడంచేత దాన్ని ఆనుకొని పెద్దపెద్ద మేడ లున్నాయి. మా యింటికి గాలి వెలుతురూ అంతగా లేకపోయినా నేనుండే చీకటి గదికంటె బాగానే ఉంది. మా తల్లిగారికి విధవత్వం రావడంతోనే, ఆమె ముఖంలో పూర్వం మాదిరి నవ్వు కనుపించడం లేదు. అయినా ఆమె దగ్గర ఉండడంవల్ల నాకెంతో సౌఖ్యంగా ఉంది.

మా యింటిముందు పెద్దమేడ ఒకటి ఉంది. దానిగుమ్మం రాజవీధిలోకి ఉన్నా వెనకవైపు తోటకు సందులో చిన్న గుమ్మం ఉంది. నాచెల్లెలు, చిన్న తమ్ముడు త్వరలోనే తోటమాలీలతో పరిచయం చేసికొని పువ్వులు, పళ్లు యింటికి తేవడం మొదలుబెట్టారు. ఆ యిల్లెవరిదో మాత్రం నాకు తెలియలేదు. సందువైపున ఉండే కిటికీ లెప్పుడు మూసే ఉండేవి.

ఒక రోజున నేను పాఠశాలనుంచి యింటికి వచ్చేసరికి చెల్లెలూ, తమ్ముడూ ఏడుస్తూ కూర్చున్నారు. కారణం ఏమిటో కనుక్కున్నాను. మా ఎదుటింట్లో ఏదో గొప్పకార్యం జరుగుతుందని తెలిసింది. వచ్చిన అతిథులను సత్కరించడానికి గొప్ప ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లలిద్దరూ అక్కడకు వెళతామని పట్టుబట్టారు. మా అమ్మగారికి వారెవరూ పిలవకుండానే వీళ్లక్కడికి వెళ్లడం యిష్టం లేకపోయింది. అందుచేత నేను సమాధానంచేసి మాధవునితో యిద్దరిని జంతుప్రదర్శనశాలకు పంపించివేశాను.

బళ్లో నుంచివచ్చి యింటివద్ద ఆట్టేసేపు ఉండడానికి వీల్లేదు. తిరిగి యితర కుఱ్ఱాళ్లకి పాఠాలు చెప్పడానికి వెళ్లిపోవాలి. నేను సందులోకి వెళ్లేటప్పటికి ఆతోటలో ఎంతో హడావిడిగా ఉంది. నౌకర్లు యిటుతిరిగేవాళ్లు-అటుతిరిగేవాళ్లు,తొందరగా తోటంతా బాగు చేస్తున్నారు. నేను పాఠాలుచెప్పి తిరిగి వచ్చేసరికి తోటలో విందు మహోత్సాహంగా సాగుతూఉంది. సందులో పెద్ద గుంపుచేరి చూస్తున్నారు. లోపలినుండి సంగీతం వినిపిస్తూ ఉంది. బయటనిలుచున్న వాళ్లల్లో చాలామంది బుఱ్ఱలు తిప్పేస్తున్నారు. లోపలి పెద్దమనుష్యులకు సంగీతం అట్టే రుచించినట్లు కనుపించ లేదు.

గుంపులోనుంచి నాకు నడకసాగలేదు. నిలబడిపోవలసివచ్చింది. మేడంతా విద్యుద్దీపాలతో వెలిగిపోతూ ఉంది. కిటికీలు తలుపులు తెరచిఉన్నాయి. ఇంతలో నాదృష్టి ఒక కిటికీవంకకు ఆకర్షింపబడింది.

"ఏమిది! ఈమె యిప్పటి కేలావచ్చింది? నాహృదయాన్ని హరించిన ఆయువతీమణి యీప్రక్కనే ఉందని యింతకాలమూ తెలిసికోనేలేకపోతినే" అని ఆశ్చర్యపడ్డాను.

ఆకిటికీవద్ద స్వర్గమునుండి దిగివచ్చిన దేవతవలె నిలుచున్నది సుశీలయే. ఆమె తండ్రిగారి కుటీరమునుండి యీగొప్పభవనములోనికి వచ్చిన తరువాత ఆమె యందంతో మార్పుకలిగినప్పటికి నే నానవాలు కట్టగలిగాను కాని ఆమెయందలి పూర్వపు మృదుత్వము నశించిపోయింది. ఆకండ్లయందలి తేజస్సు కనుపించడంలేదు. కళావిహీనమైన చలువరాతిబొమ్మవలె కనుపిస్తూఉంది. ఒక్కనిమిషం తోటవైపు క్రిందకు ఆమె చూచింది. ఆచూపులు ద్వేషపూరితములై ఉన్నాయి. అంతలో కిటికీ పెద్దచప్పుడయ్యేటట్టు మూసి లోపలికి వెళ్లిపోయింది.

నాప్రక్కను నిలబడ్డ ఒకరిని యిక్కడ ఏమి జరుగుతూ ఉందని అడిగాను.

"జమీందారుగారి మనమడి అన్నప్రాశనఉత్సవం. అందుచే అందర్ని భోజనాలకు పిలిచారు చూడండి అదిగో ఆయన పెద్దకొడుకు."

నేను చూచాను. మనిషి మధ్యవయస్సులో ఉన్నాడు. లావుగా బట్టతలా ఆయనాను. అటువంటిమనిషికి సుశీల తల్లిగా ఉంది.

జమీందారెవరని నే నడిగాను:

"సరి. ఆయనిక్కడేలాఉంటాడు. రెండేళ్లయి పక్షవాతంవచ్చి పడిపోయారు. మంచం దిగడంలేదు" అన్నాడు.

ఇప్పటికి నాకంతా అర్థమైంది. ఎట్లాగో గెంటుకుని యింట్లో పడ్డాను. ఆరాత్రి నాకు బాగా నిద్రపట్టలేదు.

ఇంతకుముందాయింటిలో ఎవరు లేరనుకునేవాణ్ణి. ఇప్పటినుంచి గమనించి చూస్తూఉంటే అప్పుడప్పు డొక కిటికీ తెరవబడుతూ ఉన్నట్టు కనుపించింది. తిరిగీ ఒక్కసారి ఆమె సందర్శనభాగ్యం కలుగుతుందా అని కనిపెట్టిఉండేవాణ్ణి. ఒకరోజున ఆమె మా యింటి వైపు దీక్షగా చూచింది.

ఆమెకు తెలుసునాఏమి! అని అనుమానం కలిగింది. ఏంప్రయోజనం ఆమె యిప్పుడు మహారాణి. నేను బీదఉపాధ్యాయుణ్ణి.

కాలం గడచిపోతూ ఉంది. మామాధవుని పెండ్లికి మంచిసంబంధం ఏదైనా దొరకుతుందా అని మాఅమ్మ చూస్తూఉంది. మాధవుడు యమ్. ఏ. ప్యాసయ్యాడు. అనేకసంబంధాలు నలుగుతున్నాయి. ఈసారి రామచంద్రయ్యాగారి ప్రమేయం లేకుండానే జరుగుతుందని నాకు ధైర్యమేకాబట్టి నేనేమీ అభ్యంతర పెట్టలేదు. చాలామంది కన్యలగురించి విన్నాం. మాఅమ్మకునచ్చిన వాళ్లు మాతమ్మునికి నచ్చక, తమ్మునికి నచ్చినవాళ్లు మా అమ్మకు నచ్చక యిల్లాగే రోజులు వెళుతూఉన్నాయి. మాయింటిప్రక్కకూడా ఒకకన్యఉంది. తండ్రి బీదవాడు. పిల్ల ఎక్కువ అందకత్తెకాదు. సాధారణంగా ఉంటుంది. కన్య బాగాఉంటే కట్నం లేకపోయినా చేసుకోవడానికి మాఅమ్మ యిష్టపడేదే.

వైశాఖమాసం. ఎండలు ఎక్కువగా కాస్తున్నాయి. వేసవికి మాపాఠశాల మూసినా ఉదయం సాయంకాలం కొందరువిద్యార్థులకు పాఠాలు చెప్పడానికి వెళ్లవలసి ఉంటూఉంది. ఆరోజున గాడ్పు విశేషంగావేస్తూఉంది. ఐనా, పాఠాలకు వెళ్లడం తప్పదు. ఆరాత్రి మాయింటి ప్రక్క నున్న కన్యకు వివాహం జరుగుతుంది. పెండ్లికి యిల్లు తణఖాపెట్టి తండ్రి అప్పుతీసుకువచ్చాడు. ఇంటికి మామిడితోరణాలుకట్టి అలంకారాలు చేస్తున్నారు. వాకిట్లో సన్నాయిమేళం వాయిస్తున్నారు. నా చిన్న తమ్ముడు చెల్లెలు అప్పుడేవెళ్లి కూర్చున్నారు. నన్ను, మాధవునికూడా పిలిచారు. సాయంకాలం పెండ్లిసమయానికి వెళ్లవచ్చనుకున్నాం. నేను సందులోనుంచి వెళుతూఉండగా మాయింటియెదుట మేడదొడ్డి గుమ్మం తీసికొని ఒకదాసిమనిషి జమీందారుగారి పిల్లను వెంట బెట్టుకొని పెండ్లివారింటికి పేరంటంతీసికొనివస్తూఉంది. పెండ్లివారిల్లు బీదదికాబట్టి పెద్దలు రావడానికి సందేహించారుకాబోలు ననుకున్నాను.

నేను పాఠాలు చెప్పుకొని తిన్నగా పెండ్లివారింటికి వెళ్లాను. అక్కడి సంగతంతా చూసేసరికి నేను కలగంటూ ఉన్నట్టు అనిపించింది. నాజన్మలో మరవడానికి వీల్లేని నాపెండ్లి నాటిరాత్రి కండ్ల గట్టింది. వరుడు తరఫువారి ఆక్షేపణలు పెండ్లికుమార్తె పరిజనం ఏడ్పులు, అన్నీ యథాప్రకారమే. నేను వెళ్లేసరికి నాటకం ముగింపుకొస్తూఉంది. పెండ్లికొడుకువారంతాచుట్ట బెట్టుకొని ఒక్కసారి అవతలికి వెళ్లిపోయారు. వరకట్నం పూర్తిగా చెల్లించినందున యీలాజరిగింది. పెండ్లికుమార్తె పీటమీదనుండి ముందుకు పడిపోయింది. ఆమెను లేవదీసేవారైనా లేకపోయారు. అంతాఎల్లాగో పెళ్లి చేసెయ్యాలని ఎవరైనా తగినవరుడు దొరుకుతాడేమో అని చూస్తున్నారు.

ఒక్కనిమిషం, 'పోనీ నేను చేసుకుందునా' అనిపించింది. నేనుచేసినపాపం కొంతతీరిపోతుందనుకున్నా. కాని నాకాళ్లు కదల్లేదు. ఆకన్యనావల్ల ఏమిసౌఖ్యపడుతుంది! కాని పెండ్లివారి గోలవింటూఉంటే నాహృదయం పగిలిపోతూఉంది.

అంతలో ఒకయువకుడు ముందుకువచ్చి పెండ్లికుమార్తె తండ్రితో "అయ్యా, మీరేమీ ఆదుర్దాపడనక్కరలేదు. మీకిష్టమైతే నేను మీకుమార్తెను వివాహం చేసికోడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు.

ఈవాక్యం అమృతయోగంలా నామనస్సు చల్లపరిచింది. ఏదో దివ్యప్రభావంలాగు నిమిషంలో అంతా మారిపోయింది. ఒక్కసారి నామాధవుని కౌగిలించుకోవాలని బుద్ధిపుట్టింది. 'తమ్ముడా నీకోసము నే పడిన కష్టమంతా సార్థకంచేశావు. నా నేరముయొక్క బరువు మనస్సులోనుండి తగ్గించివేశావు' అనుకొన్నా. పెండ్లికాగానే మాధవుడు మాఅమ్మగారికి తానే యీసంగతి ముందుగా తెలియబరచాలని వధువుతో యింటికి బయలుదేరాడు. నేనూ వెంటబడ్డాను.

మా అమ్మ తలుపుతీసింది. ఇద్దరినిచూచి ఆశ్చర్యంతో నిలబడింది. తక్షణం జరిగిందంతాఆమెగ్రహించింది. నిష్ఠురంగా చూస్తూ నిలుచుంది. మాధవుడు తల వంచుకున్నాడు. వధువు వణుకుతూ ఉంది.

ఇంతలో నేను కలుగజేసికొన్నాను. "అమ్మా, నీకోసంవాళ్లను క్షమించాలి. లేకపోతే నా జన్మశాప దగ్ధమై పోతుంది. నీ పెద్దకొడుకుచేసిన పాపమునకు నీ చిన్నకుమారుడు ప్రాయశ్చిత్తం పొందాడు. నామనస్సు చల్లబడింది. ఇది నిన్ను విచారపెట్టవలసిన సంగతా" అన్నాను.

మాఅమ్మ కన్నీరు నించింది. మాధవుడు భార్యతో ఆమెకు సాష్టాంగనమస్కారం చేశాడు. యిప్పటివరకు దూరాన్నుంచి భయంతోచూస్తూ ఉన్నపిల్లలు సంతోషంతో కేకలువేసుకుంటూ చుట్టూ మూగారు.

మర్నాడు చుట్టుప్రక్కలఉన్న ఆడవాళ్లంతా కన్యను చూడ్డానికి వచ్చారు. ఇల్లు చిన్నదవడంచేత నేను యింట్లో ఉండడానికి వీల్లేకపోయింది. రోజంతా బయటనే గడిపాను. సాయంకాలమైంది. చీకటి పడుతూ ఉన్నది. ఈ సమయంలో ఎవరు రారుగదా యని యింటికి వెళ్లాను. అప్పుడు నేను చేసినపొరపాటు గ్రహించాను. నా ఎదురుగా ఎఱ్ఱని బనారసు చీరకట్టుకొని ఒకామె నిల్చున్నది. ఆమె వీపు నావైపుకు ఉంది. అయినా నేను ఆనవాలు కట్టగలిగాను. ఈ రాణీ యీ బీదవాళ్లింటికి ఎందుకు వచ్చిందా అనుకున్నా.

సుశీల నన్ను చూడలేదు. ఆమెతో వచ్చినదాసి "అమ్మగారెక్కడున్నారు. అని కేకవేసింది. నాచెల్లెలు వచ్చి, "మా అమ్మ కోవెలకువెళ్లింది, రండి." అని వారిని మాధవుని గదిలోనికి తీసికొని వెళ్లింది. నేను తొందరగా నాగదిలో ప్రవేశించాను. సుశీల ఎందుకు వచ్చిందో మాత్రం నాకు బోధపడలేదు. ఏమి జరుగుతుందో అని వింటున్నా.

సుశీల తనదాసీని అవతలికి వెళ్లమని చెప్పింది. ఆ దాసీ మా దాసీతోకలసి దొడ్లోకివెళ్లి ఏవో మాటలు చెప్పుకుంటూ కూర్చున్నారు. తిరిగి సుశీలమాటలు వినిపించాయి. అవి ద్వేషపూరితములై భయంకరంగా ఉన్నాయి. నాకుకూడా భయంవేసింది.

"ఏదీ చూడనియ్యి. నీవెంతఅందంగా ఉన్నావో? ఈ యింట్లో ప్రవేశించడానికి నీకు హక్కు ఏలా కలిగింది? నాకంటె ఎక్కువ అందంగా ఉన్నావా? ఆయన నన్ను తిరస్కరించారు. నాజీవితం పరితాపాగ్నిలో పడద్రోశారు. నిన్నత్యంతప్రేమతో స్వీకరించారు. నాకంటె నీలో ఎక్కువ ఏమున్నది? ఎక్కువ డబ్బున్నదా? నగలు ఎక్కువ పెట్టుకున్నావా? చూపించు." అని వధువు నుద్దేశించి సుశీల పలికింది.

నా చెల్లెలు భయపడి ఏడుస్తూ ఉంది. నేను తక్షణం ఆ గదిలోకి వెళ్లాను. పెండ్లికుమార్తె ఒకమూల కూర్చుని వెఱ్ఱిచూపులు చూస్తూ ఉంది.

నేను గదిలో ప్రవేశించగానే "సుశీలా" అని పిలిచాను.

ఆమె నావైపుతిరిగి చూచింది. నావద్దకువచ్చి "మీభార్య మాట్లాడడం లేదు. కాబట్టి మీరే చెప్పండి నాకంటె ఆమె దేనిలో అధికురాలో సౌందర్యంలోనా, భాగ్యంలోనా, సుగుణసంపత్తిలోనా?" అని అడిగింది.

"సుశీలా, నీవు పొరపాటుపడ్డావు. ఆమె నా భార్య కాదు. నాతమ్ముడు మాధవుడు పెండ్లిచేసికొన్నాడు!" అని చెప్పాను.

"ఆమె మీభార్య కాదూ" అని సుశీల పెద్దకేక వేసింది.

దొడ్లోనుంచి ఆమెదాసీ పరుగెత్తుక వచ్చి సుశీల చెయిపట్టుకొని "బాబూ, ఏమీ అనుకోకండి. ఈమధ్య కొన్నాళ్లనుంచి మారాణీకి కొంచెం సుగుణంగా ఉంటూంటే యిట్లా తీసికొచ్చాను. ఇంతలోనే మారిపోతుందని అనుకోలేదండి. ప్రొద్దున్నుంచి పెండ్లికుమార్తెను చూస్తాను, తీసుకువెళ్లమని పేధిస్తూఉన్నారు. నెమ్మదిగా ఉన్నారని తీసుకొచ్చేసరికి ఎల్లా జరిగిందో చూడండి." అంటూ అవతలికి తీసుకి వెళ్లిపోతూ ఉంది. నేనూ వెనుకనే వెళ్లి "ఎప్పటినుంచి యీమె కిట్లా ఉంది" అని అడిగాను.

"రెండేళ్లపైగా అయింది బాబూ. నే నిక్కడ పనిలో ప్రవేశించినప్పటినుండి యీమె. పిచ్చిధోరణి

గానే ఉంటూఉంది. జమీందారుగారు వైద్యులకు వేల కొద్దీ పోస్తున్నారు. ఏమీ లాభం లేక పోతూఉంది."

వారు వెళ్లిపోయిం తెరువాత నేను గదిలోకి వచ్చాను. నాపాపభరం యీజన్మకు తొలగదు. నాకు ప్రాయశ్చిత్త మేముంది? ఏమిదారి? అని ఆవేదన పడ్డాను.



"ఆమెవైపు తిరిగిచూచింది."మీభార్య మాట్లాడడం లేదు. కాబట్టి........సుగుణసంపత్తిలోనా" అని అడిగింది"

రోజులు గడచిపోయినవి. ఒకదినం పెద్దమేడలో గందరగోళం వినిపించింది. మనుష్యులు యివతలికి అవతలికి పరుగెడుతూ ఉన్నారు. వీథిగుమ్మంలో చాలాజనం చేరారు. నేనాలావెళ్లి ఏమి జరిగిందని అడిగాను.

సుశీల అకస్మాత్తుగా కలరాతగిలి చనిపోయిందని చెప్పారు. వైద్యులెవర్నీ పిలవలేదు. ఎవరితోనూ చెప్పనుకూడా లేదట. ఇప్పుడు తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నారు.

నేను కనిపెట్టుక నుంచున్నాను. మాదారులు వేరైపోయినవి. ఆమెప్రాణప్రయాణసమయమందు స్నేహితుని రీతిని శ్మశానంవరకూ అనుసరించి తిరిగివచ్చాను.

---